## క్లుప్తంగా

### గర్భిణులకు '102' సేవలు



102 సిబ్బంది, ఆశవర్కర్లతో గర్భిణులు

లింగాపూర్: మారుమూల లింగాపూర్ మండలంలో అనేక గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. ఆయా గ్రామాల్లోని గర్భిణీ మహిళలు అత్యవసర సమయాల్లో ఆసుపత్రుల కు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో 102 వాహన సిబ్బంది గర్భిణులకు సేవలు అందిస్తున్నారు. ఈ వాహనం ద్వారా మండలంలోని గర్భిణులను ఉచితంగా ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తున్నారు. లింగాపూర్ పీహెచ్‌సీలో చెకప్, డిశ్చార్జి పొందిన మహిళలను ఉచితంగా ఆశ వర్కర్ల సాయంతో ఇంటికి తరలిస్తున్నారు. దీంతో ఎల్లాపటార్, కీమానాయక్‌తండా, దంపూర్, లోద్దిగూడ, చోర్‌పల్లి, కొత్తపల్లి, వంకాయమద్ది, పట్కల్‌మంగి తదితర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### పూలాజీ బాబా మందిరానికి భూమిపూజ

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి గ్రామంలో పూలాజీ బాబా ఆలయ నిర్మాణానికి, గంగపుత్ర సంఘం వద్ద రేకుల షెడ్డు నిర్మాణానికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్ అరుణతో కలిసి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్షల రూపాయల వ్యయంతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి సౌజన్యంతో నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామస్తులు ప్రవీణ్, మోహన్, గణపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన దుగుంటా నారాయణ ఆదివారం అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. తనకున్న చేనులో పత్తి పంట సాగు చేస్తున్నాడు. పనుల నిమిత్తం చేనుకు వెళ్లిన క్రమంలో అడవి పంది హఠాత్తుగా దాడి చేసింది. కేకలు వేయడంతో అక్కడున్న వారు అడవి పందిని తరిమేసి, బాధిత రైతును చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

### మట్కా ఆడుతున్న వ్యక్తి అరెస్ట్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో మట్కా ఆడుతున్నారన్న ముందస్తు సమాచారం మేరకు పట్టణంలోని నౌగాంబస్తీ కాలనీలో మహ్మద్ గౌస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.1250 నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### పిచ్చికుక్కల స్వైరవిహారం

రెబ్బెన: మండలంలోని తుంగెడ, మాద్వాయిగూడ గ్రామ పంచాయతీల్లో ఆదివారం పిచ్చికుక్కలు పలువురిపై దాడి చేసి గాయపర్చాయి. ఆదివారం తుంగెడకు చెందిన పూదరి బాపుతో పాటు మరో ఇద్దరిపై పిచ్చికుక్క దాడి చేసింది. గ్రామంలో రెండు ఆవులు, ఒక మేకపై దాడి చేయడంతో మేక మృతి చెందింది. మాద్వాయిగూడ పంచాయతీ పరిధిలో నలుగురిపై కుక్క దాడి చేసి గాయపర్చింది. దాంతో గాయాలపాలైన వారిని రెబ్బెన పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అయితే ఇటీవల మండలంలోని అనేక పంచాయతీల్లో పిచ్చికుక్కల స్వైర విహారం పెరగడంతో పాటు కుక్కకాటు బాధితుల సంఖ్య పెరిగింది. అయినా పంచాయతీ అధికారులు కుక్కలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరామార్కెట్ ఏరియాలో విద్యుత్ లైన్ పనులు నిర్వహిస్తున్నందున సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంజీవయ్య కాలనీ, ఇందిరామార్కెట్, గాంధీచౌక్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జైనథ్ : వర్షాకాలంలో ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సీహెచ్‌వో అంజయ్య తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. మండల కేంద్రంలో ఒకరికి డెంగ్యూ పాజిటివ్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గంగామణి, గంగాదేవి, ఆశ వర్కర్లు లక్ష్మి, స్రవంతి, పంచాయతీ కార్యదర్శి ముజీబ్‌ఖాన్ పాల్గొన్నారు.

# ఎనిమిది నెలలకే 'తారు'మారు

- అధ్వానంగా మారిన ఖమాన బీటీ రోడ్డు
- రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు గాలికి
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్



ఖమాన రోడ్డుపై ధ్వంసమైన బీటీ

వాంకిడి: నాసిరకమైన మొరం, నాణ్యతలేని కంకర, నిర్లక్ష్యపు పనులు, పట్టింపు లేని వ్యవస్థ, వీటన్నింటికి నిలువెత్తు నిదర్శనంగా ఖమాన వెళ్లే బీటీ రోడ్డు నిలుస్తోంది. దశాబ్దాల కాలంగా గుంతలు లేని రహదారి కోసం వేచి చూసిన ఆయా గ్రామస్తుల కల ఎనిమిది నెలలకే కనుమరుగవుతుంది. గత ప్రభుత్వం మండల కేంద్రం నుంచి ఖమాన గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటిన్నర మంజూరు చేయగా అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ జాప్యంతో నిధులు మంజూరైన రెండేళ్లకు పనులు పూర్తయ్యాయి. నాణ్యత ప్రమాణాలు గాలికి వదిలేయడంతో నూతనంగా నిర్మించిన డాంబర్ రోడ్డుపై ఏడాది గడవక ముందే గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రూ.1.57 కోట్లతో నిర్మాణం..**

మండల కేంద్రం నుంచి ఖమాన గ్రామం వరకు సుమారు 2.5 కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1.57 కోట్లు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు దాదాపు రెండేళ్ల పాటు ఆగుతూ.. సాగుతూ.. అన్నచందంగా పనులు చేపట్టారు. పాత డాంబర్‌ను నామమాత్రంగా తొలగించి రోడ్డుపై మొరం వేయకుండానే డస్ట్‌తో కూడిన కంకరతో రోలింగ్ చేయించారు. రోడ్డుకు ఇరువైపుల బీటీ కుంగిపోకుండా, పాదాచారులు, ఎడ్లబండ్లు నడిచేందుకు అనుకూలంగా మొరం మట్టితో రోలింగ్ చేయాల్సి ఉండగా గుట్టపై లభించే నాసిరకం మట్టిని వాడారు. అది కూడా నామమాత్రంగా మెరుగులు అద్ది వదిలేశారు. పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యానికి వదిలేయడంతో నాణ్యతలోని డొల్లతనం బయటపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

**పర్యవేక్షణ లోపం..**

అధికారుల పర్యవేక్షణ లోపంతో నాసిరకం పనులు చేపట్టడం వల్ల ఖమాన బీటీ రోడ్డుకు ఏడాది గడవక ముందే గుంతలు పడుతున్నాయి. బీటీ పనులు చేపట్టే క్రమంలో గ్రామస్తులు కొందరు నాణ్యతలేమిపై నిలదీసినా ఫలితం లేకుండా పోయిందని, రాత్రిళ్లు వాహనాల లైట్ల వెలుగుల మధ్య పనులు చేపట్టినట్లు చెబుతున్నారు. డాంబర్ వేసే క్రమంలో రోడ్డుపై ఉన్న దుమ్ము, మట్టిని శుభ్రం చేయాల్సి ఉండగా అవేమి పట్టించుకోకుండానే పనులు చేపట్టారని ఆరోపిస్తున్నారు. ఏడాది గడవక ముందే గుంతలు పడుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై పలు చోట్ల ఏర్పడిన గుంతలకు ప్రారంభంలోనే మరమ్మతులు చేపట్టి పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పడ్డ గుంత

**ఏడాది గడవక ముందే..**



నాణ్యత లేమితో రోడ్డు పనులు చేపటగా నిర్మించిన సంవత్సరం లోపే రోడ్డుపై గుంతలు పడుతున్నాయి. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే రోడ్డుపై భారీ గుంతలు పడే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– జాడి తిరుపతి, ఖమాన

# గణనాథుడికి పూజలు



కెరమెరి: విద్యానగర్‌లో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు



కాగజ్‌నగర్‌టౌన్: పెద్దవాగులో గణేశ్ నిమజ్జనం చేస్తున్న భక్తులు



కాగజ్‌నగర్‌టౌన్: గాంధీనగర్‌లో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



ఆసిఫాబాద్‌రూరల్: అన్నదానంలో భక్తులు

కెరమెరి: మండలంలోని వివిధ మండపాల్లో ప్రతిష్ఠించిన లంబోదరుడు నిత్యం పూజలందుకుంటున్నాడు. ఉదయం, సాయంకాలం అర్చకుడు కులకర్ణి బాపూజీ ఆధ్వర్యంలో పూజలు కొనసాగుతున్నాయి. మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా అందరు పూజలు చేస్తున్నారు. ఆదివారం మహిళలు మంగళహారతులతో పూజలు చేస్తున్నారు. మండలంలోని శివాలయం, బెస్తవాడ, సేవాదాస్‌నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని గణేశ్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగర్ 1, వార్డు నం.8లోని బారెవాడ, సంజీవయ్య కాలనీల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీనగర్ వినాయక మండపంలో డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ –అనితలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఘనంగా నిమజ్జనం..**

కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగు పంప్‌హౌజ్ సమీపంలో భక్తులు గణేశ్ నిమజ్జ నాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ద్వారకానగర్, పలు కాలనీల్లో ఐదు రోజుల పాటు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదో రోజు ప్రత్యేక వాహనాల్లో కుటుంబ సభ్యులతో వచ్చి పెద్దవాగులో గణేశ్ నిమజ్జనం చేశారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని వివిధ వినాయక మండపాల వద్ద ఆదివారం అన్నదానాలు జోరుగా కొనసాగాయి. వినాయకులను ప్రతిష్ఠించి ఐదు రోజులైన నేపథ్యంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయంలో బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజంపేట్, కంటుకోట, మోతుగూడలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# ఇరుకు రోడ్లతో ఇబ్బందులు



సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని ఇరుకు రోడ్డు



ఇరుకు రోడ్డుపై వెళ్తున్న భారీ వాహనాలు

- నిత్యం భారీ వాహనాల రాకపోకలు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- దుమ్ము, ధూళితో తిప్పలు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారులు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కౌటాల, కాగజ్‌నగర్, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు వెళ్లే రోడ్లతో పాటు మహారాష్ట్రకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారులు కూడా ఇవేకావడంతో ప్రతి నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. గ్రామపంచాయతీ పరిధిలో ఇరుకు రోడ్ల కారణంగా భారీ వాహనాలు పట్టణం దాటే వరకు తీవ్రంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. స్థానిక బస్టాండ్ ప్రాంతం నుంచి పేట్ మహెలా కాలనీ, డొనల్, గోవింద్‌పూర్, ఎస్సీకాలనీల మీదుగా వెళ్లే ప్రధాన రహదారిలో భారీ వాహనాలు వస్తే ఇతర వాహనదారులకు, స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఎన్నో ఏళ్లుగా ఇరుకు రోడ్లు, భారీ వాహనాలతో ద్విచక్రవాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రధాన రహదారులు సిర్పూర్(టి) పట్టణం మీదుగా ఉండటంతో గ్రామపంచాయతీ ప్రజలు ట్రాఫిక్ అంతరాయంతో, వాహనాల దుమ్ముధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**పార్కింగ్ పరేషాన్..**

పట్టణంలో ఉన్న వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ లేకపోవడం, బస్టాండ్ ప్రాంతంలో పార్కింగ్‌కు ఎలాంటి స్థలం లేకపోవడంతో ప్రధాన రహదారుల గుండానే వాహనాలు నిలుపుకోవాల్సి వస్తుంది. దీంతో పట్టణంలో పార్కింగ్ లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం మీదుగా భారీ వాహనాలు ప్రయాణాలు సాగిస్తే ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లుతుందని బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇరుకు రోడ్లపై భారీ వాహనాల రాకపోకలతో పట్టణంలో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మండలవాసులు వాపోతున్నారు.

**ట్రాఫిక్‌కు అంతరాయం..**



సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలో రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. భారీ వాహనాల రాకపోకలతో ద్విచక్రవాహనదారులు, స్థానికులం తిప్పలు పడుతున్నాం. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది.

– సుర్పం అర్జు, సిర్పూర్(టి)

**అధికారులు స్పందించాలి..**



ఏళ్లుగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య, దుమ్ముధుళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలో ఇరుకు రోడ్లు లేకుండా చర్యలు చేపట్టాలి.

– బండ సంజీవ్‌కుమార్, సిర్పూర్(టి)

# వాగు దాటలేక తిప్పలు..!

- అసంపూర్తిగా వంతెన పనులు
- ఏటా తప్పని కష్టాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



లక్మాపూర్ వాగు దాటుతున్న ప్రజలు



నిలిచిన లక్మాపూర్ వాగుపై వంతెన పనులు

కెరమెరి: భారీ వర్షాలు కురిస్తే మండలంలోని పలు గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి ఆయా గ్రామాల ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాగులు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో వానలు పడకున్నా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసినా వాగుల్లో భారీగా నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక రోగులు, బాలింతలు, గర్భిణీలు, చిన్నారుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండలంలోని లక్మాపూర్, అనార్‌పల్లి వాగు అవతల ఉన్న ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

**పనులు నిలిచిపోవడంతో..**

మండలంలోని లక్మాపూర్ వాగుపై నిర్మిస్తున్న వంతెన 2016లో రూ.3 కోట్లతో ప్రారంభించారు. 2017లో నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. పిల్లర్లు నిర్మించి ఎనిమిదేళ్లు గడుస్తున్నాయి. ముగ్గురు గుత్తేదారులు మారినా ఫలితం లేకుండా పోయింది. అనార్‌పల్లి వాగుపై 2016లో రూ.5 కోట్ల నిధులతో ప్రారంభమైన వంతెన పనులు 2018లో పూర్తి కావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు రెండు వంతెన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అనార్‌పల్లి వాగుపై నుంచి కరంజివాడ, బోరిలాల్‌గూడ, జన్కాపూర్ తదితర గ్రామాల ప్రజలు కెరమెరికి రావాలంటే ఈ దారి వెంటే రావాలి. కానీ ప్రస్తుతం వాగు పొంగి ప్రవహించడంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాగు దాటుతున్నారు. గుత్తేదారులు నిర్లక్ష్యం వల్ల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నిత్యావసర సరుకులతో పాటు రోగులు ఆసుపత్రికి, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి ఉంది.

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి**



ప్రస్తుతం వాగు దాటలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో కష్టాలు పడుతున్నా అధికారులకు కనికరం రావడం లేదు. వంతెన పనులు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

– రాథోడ్ రవినాయక్

# రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనానికి యత్నం



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేయకుండా అడ్డుకుంటున్న పోలీసులు

రెబ్బెన: ప్రధాని నరేంద్రమోడీ తల్లిపై రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ తల్లిపై రాహుల్‌గాంధీ సభ్య సమాజం సిగ్గు పడే రీతిలో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. విద్వేష సంస్కృతిని వ్యాప్తి చేయడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయంగా పెట్టుకుందన్నారు. రాహుల్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి మల్లేశ్, కోశాధికారి మండల మధుకర్, కార్యదర్శి మంజుల వెంకన్న, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రామికవర్గాల పెన్నిధి అన్నాభావు సాఠే

నార్నూర్: శ్రామికవర్గాల పెన్నిధి అన్నాభావు సాఠే అని సీఐ ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అన్నాభావు సాఠే చౌక్ వద్ద 105వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్‌తో కలిసి జెండా ఆవిష్కరించారు. తన రచనలతో సమాజంలో అవగాహన కల్పించేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. సమాజ చైతన్యం కోసం నిరంతరం శ్రమించారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బ్రిడ్జులాల్, రెడ్డినాయక్, ఆడే సురేశ్, మాడవి మాన్కు, కైలాస్ నాయక్, మహేందర్ పాల్గొన్నారు.

## సామూహిక కాలభైరవ స్వామి హోమం



కాలభైరవ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో కొలువైన కాలభైరవ స్వామి ఆలయం వద్ద అష్టమి ఆదివారం సందర్భంగా భక్తులు సామూహిక కాలభైరవ స్వామి హోమం నిర్వహించారు. అష్టమి సందర్భంగా కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవ స్వామిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి స్వీట్లు, మద్యం నైవేద్యాలుగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక హోమం నిర్వహించి కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్‌స్వామి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



సామూహిక హోమం చేస్తున్న భక్తులు

# పిచ్చి మొక్కలు తొలగింపు



పిచ్చిమొక్కలు తొలగించిన తర్వాత..

సాక్షి ఎఫెక్ట్

కాగజ్‌నగర్‌టౌన్: మున్సిపాలిటీలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న పిచ్చిమొక్కలపై 'విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ నిర్లక్ష్యం' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఆదివారం అధికారులు సిబ్బందితో కలిసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు.